Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

APTEL:2024/86143 జాతీయ తెలుగు దినపత్రిక




Editor : Dama Vijaya Kumar | Volume : 6 | issue: 343 | Price : 3/- | Pages : 4 | Thirupati - Chittoor

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :343 | ఆదివారం 14 డిసెంబర్ 2025 | వెల : 3 | పేజీలు : 4

## అమరావతికి అడ్డంకులు

# క్లియరైనట్టేనా



అమరావతిని నోటిఫై చేయడానికి కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేస్తుందనే ప్రచారం

దీనికి సంబంధించిన బిల్లును తిరిగి పంపించిందని కూడా వార్తలు

ఇంకా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని ఎప్పుడైనా బిల్లు ఆమోదం పొందవచ్చని అంటున్నారు

మొత్తానికి ఈ వార్త ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయడానికి కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించిన బిల్లును తిరిగి పంపించిందని కూడా వార్తలు వస్తున్నాయి. న్యాయపరమైన చిక్కులు, నిధులు సమస్యల కారణంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని అంటున్నారు. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. ఇంకా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని ఎప్పుడైనా బిల్లు ఆమోదం పొందవచ్చని అంటున్నారు. మొత్తానికి ఈ వార్త ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. అమరావతిని ఆంధ్రప్రదేశ్‌గా నోటిఫై చేయించుకుంటే భవిష్యత్‌లో మార్పులు చేర్పులకు అవకాశం ఉండని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర విడిపోయిన తర్వాత కమిషన్ వేసి అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది నాటి టీడీపీ ప్రభుత్వం. అయితే జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాజధానిగా పెట్టేందుకు అంగీకరించలేదు. దీంతో మూడు రాజధానులు అంటూ సరికొత్త పల్లవి అందుకున్నారు. వివిధ కారణాలతో మూడు రాజధానుల వ్యవహారం కూడా ముందుకు సాగలేదు. తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడు రాజధానుల వాదనను ప్రజలు తిరస్కరించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమరావతి మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని స్పష్టం చేసింది. అక్కడ అభివృద్ధి పనుల కోసం వివిధ ఆర్థిక సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. కేంద్రం కూడా దీనికి ఓకే చెప్పింది. అయితే కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మళ్లీ మార్చకుండా ఉంటాయా అనే అనుమానం ఉంది. దీంతో భవిష్యత్‌లో ఇలాంటి గందరగోళానికి ఆస్కారం లేకుండా ఉండేందుకు కేంద్రమే ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసేలా ప్రయత్నాలు చేస్తోంది.అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా నోటిఫై చేయాలని కేంద్రానికి కూటమి ప్రభుత్వం బిల్ పంపించింది. 2014 నుంచి గుర్తించాలని పేర్కొంది. ఇలా చేస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని కేంద్రం భావిస్తుందని అంటున్నారు. 2024 నుంచి గుర్తిస్తే అప్పటి వరకు చేసిన ఖర్చులపై కూడా న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే ఇప్పటికే పంపిన బిల్లును తిరిగి వెనక్కి పంపించారని అంటున్నారు. ప్రత్యామ్నాయాలతో బిల్లు పంపించాలని సూచించినట్టు చెబుతున్నారు. తిరిగి వచ్చిన బిల్లుపై చంద్రబాబు సర్కారు న్యాయనిపుణులతో చర్చిస్తోందని అంటున్నారు. దీనికి పరిష్కార మార్గాలను కనుక్కునే పనిలో ఉన్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పూర్తి అయ్యే లోపుపంపిస్తే కేంద్రం అంగీకరించి సభలో ప్రవేశ పెట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు. లేకుంటే మళ్లీ బడ్జెట్ సమావేశాల వరకు ఎదురు - మిగతా3లో



## భూములివ్వకుంటే

# సేకరణే!

అమరావతి రైతులకు కేంద్ర మంత్రి పెమ్మసాని స్పష్టత..

అమరావతి రైతుల సమస్యలపై త్రిసభ్య కమిటీ కీలక సమావేశం

ల్యాండ్ పూలింగ్‌కు భూములివ్వని రైతులతో మరోసారి చర్చలు

సమీకరణ కుదరకపోతే వచ్చే నెలలో భూసేకరణ నోటిఫికేషన్

ప్లాట్ల విషయంలో ప్రతినెలా వాస్తు మార్పులు సాధ్యం కాదన్న కేంద్రమంత్రి

## ఉదయం విజ్ఞప్తి..

# సాయంత్రం రోడ్డు



ఉదయం వినతి.. సాయంత్రానికి రోడ్డు మంజూరు చేసిన పవన్ కళ్యాణ్..

ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ కెప్టెన్ దీపిక

గ్రామంలోని రోడ్ల పరిస్థితిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇమిడియట్ యాక్షన్

వెంటనే రోడ్డు మంజూరు చేశారు.

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, అమరావతి**

ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టును డిసెంబర్ 12వ తేదీ ఉదయం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ సందరరేగా శ్రీ సత్యసాయి జిల్లా అమరాపురం మండలంలోని మారుమూల గ్రామం తంబాళహట్టికి చెందిన జట్టు కెప్టెన్ దీపిక తన గ్రామం రోడ్ల పరిస్థితి వివరించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పవన్ కళ్యాణ్‌కు తెలిపారు. గ్రామానికి రోడ్డు వేయాలని వినతి చేశారు. అయితే, తాను వెంటనే చర్యలు తీసుకుంటానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. %దీపిక విజ్ఞప్తిని స్వీకరించిన పవన్ కళ్యాణ్ ఆ సాయంత్రానికే రోడ్డు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. గ్రామానికి నాణ్యమైన రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. - మిగతా3లో



## శివరాజ్ సింగ్ చౌహాన్‌కు

# పొంచి ఉన్న ముప్పు

- ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో భద్రత పెంపు
- పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ నుంచి ముప్పు
- సమాచారాన్ని ఐఎస్ఐ సేకరిస్తున్నట్లు తాము గుర్తించామని పేర్కొంటూ మధ్యప్రదేశ్ డీజీపీకి కేంద్ర హోంశాఖ ఒక లేఖ



## అతడి మాటలు ఎవరూ నమ్మొద్దు

- జనవరి 6న డీకే శివకుమార్ సీఎం అవుతారన్న ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్
- సొంత ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్
- ఇక్బాల్ పై చర్యలు తీసుకోవాలని వ్యాఖ్య
- పార్టీలో గ్రూపులు లేవని, తన తరపున ఎవరూ మాట్లాడవద్దని డీకే స్పష్టీకరణః
- నాయకత్వ మార్పుపై అధిషా'నం నిర్ణయానికే కట్టుబడి ఉంటానన్న సీఎం సిద్ధరామయ్య



## ఢిల్లీలో 'తీవ్ర'స్థాయికి

# వాయు కాలుష్యం

- 'గ్రాప్-3' నిబంధనలు అమలు..
- కాలుష్య కోరల్లో దేశ రాజధాని
- 400 దాటిన వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ)
- 'గ్రాప్' మూడో దశ ఆంక్షలను అమలు చేసిన ప్రభుత్వం
- ఇతర రాష్ట్రాల బీఎస్-4 డీజిల్ వాహనాలపై నిషేధం

## యువతి యువకులకు
# ఉపాధి కల్పించడమే నా ధ్యేయం..
## ప్రభుత్వం విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్



**ఎస్ఆర్ పురం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**
చదువుకున్న ప్రతి యువతి యువకులకు ఉపాధి కల్పించడమే నా ధ్యేయం అని ప్రభుత్వ విప్ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అన్నారు. శనివారం ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్ రోడ్‌లోని ఎస్ఎల్వి కళ్యాణమండపంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో ఉన్న ఆరు మండలాల్లో సుమారు 1000 మందికి పైగా యువతి యువకులు ఉద్యోగమేళాలో పాల్గొన్నారు. ఈ జాబ్ మాలకు వివిధ కంపెనీ ప్రతినిధులు ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించి, ఇంటర్వ్యూలో అర్హత పొందిన వారికి ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ మాట్లాడుతూ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో గ్రామాలను అభివృద్ధి పరుస్తూ అలాగే గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో చదువుకున్న యువతి యువకులకు ఉపాధి కల్పించడం, కోసం ఆరు మండలాల్లో ఆరు పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తాను అలాగే తొందరలో ఎస్ఆర్ పురం మండలంలో పరిశ్రమలో పనులు త్వరగా ప్రారంభిస్తాం చదువుకున్న యువతి  యువకులు ఎవ్వరు అధైర్య పడకండి నేను చదువుకున్న యువతీ యువకుల కోసం పరిశ్రమల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పిస్తామని యువతకు భరోసా కల్పించారు. అలాగే కార్వేటినగరం వెదురు కుప్పం ప్రతిమండలంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ థామస్, ఎమ్మెల్యే సతీమణి  శాంతి రెడ్డి మెగా జాబ్ మేళాలో ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన వారికి జాబ్ మంజూరు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ పురం మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు పాలసముద్రం మండల అధ్యక్షుడు తాళ్లూరి శివ, వెదురు కుప్పం మండల అధ్యక్షుడు మోహన్ మురళి గంగాధర్ నెల్లూరు మండల అధ్యక్షుడు స్వామి దాస్, పెనుమూరు మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, కార్వేటినగరం మండల అధ్యక్షుడు చెంగల్రాయ్ యాదవ్, వెదురు కుప్పం సింగల్ విండో ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, సాఫ్ట్వేర్ బాలు,టిడిపి సీనియర్ నాయకుడు, బాలాజీ నాయుడు, మాజీ సర్పంచ్ కుప్పయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్,పుల్లూరు బాబు కటికపల్లి బాబు,ఆరు మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాయల దంపతులకు  రాష్ట్ర పదవులు.

**పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**



పీలేరు అఖిల సనాతన సంఘటనకు సంబంధించి ఆంధ్రరాష్ట్రం వ్యాప్తంగా హిందూ సనాతన ధర్మం యొక్క విశిష్టత, ఆవశ్యకతల గురించి ప్రచారంచేస్తూ  హిందూజాతిని జాగృతం చేసేందుకు అఖిలభారత సనాతన సంస్థ జాతీయ అధ్యక్షులు కేతన్ భాయ్ పరా మర్, గుజరాత్‌లు డాక్టర్ పి.వివిఎస్ లక్ష్మి  డాక్టర్ రాయల సుధాకర్‌లను రాష్ట్రవ్యాప్త పదవులకు ఎన్నుకోవడం జరిగింది. యోగా రంగంలో సేవలు అందిస్తున్న డాక్టర్ పి.వి .ఎస్ లక్ష్మిని ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగం అధ్యక్షురాలుగా డాక్టర్ రాయల సుధాకర్ రాయలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సనాతన సంఘటన స్టేట్ కోఆర్డినేటర్‌గా నియమించడం జరిగింది. ఈ నియామకంతో మరింత బాధ్యత పెరిగింది అన్నారు.

# రాజనాల బండ పై విశేష పూజలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**
రాష్ట్రంలోని సత్య ప్రమాణాలకు పేరుగాంచిన మండలంలోని రాజనాల బండ పై శనివారం విశేష పూజలు జరిగాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఉదయాన్నే ప్రధానార్చకులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీనరసింహ స్వామి క్షేత్రపాలకుడు ప్రసన్న ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొందరు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదాలు వేసుకొని వెళ్లారు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది, విశేష సంఖ్యలో వచ్చిన భక్తులకు టీటీడీ సిబ్బంది. సేవలు అందించారు.

# ప్రశాంతంగా ముగిసిన నవోదయ పరీక్షలు

**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**



మండల కేంద్రమైన చౌడేపల్లిలో గల ఉన్నత పాఠశాలలో జవహర్ నవోదయ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలు జవహర్ నవోదయ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవే శానికిగాను జరుగుతున్నట్లు ఎంఈఓ కేశవరెడ్డి తెలిపారు. ఇంగ్లీష్ మీడియం లో 124 మంది తెలుగు మీడియంలో 36 మంది మొత్తం 160 మంది విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఆయన వివరించారు. ఇందులో బాలురు 89 మంది 71 మంది బాలికలు రాయాల్సి ఉండగా 24 మంది పరీక్షలకు గైహరాజరయ్యారన్నారు. చీఫ్ సూపర్ంటెండెంట్గా ప్రధానోపాధ్యాయుడు నాగరాజు రెడ్డి, సిఎల్‌వో సెంటర్ లెవెల్ అబ్జర్వర్‌గా నవోదయ పాఠశాల అధికారి శారదల పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయన్నారు. చౌడేపల్లి తహసిల్దార్ పార్వతి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గౌస్ పీర్‌కు గౌరవ డాక్టరేట్.




**వీ.కోట,చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్13:**
వీ.కోట పట్టణానికి చెందిన తెదేపా యువ మైనారిటీ నేత కే.ఎం. గౌస్ పీరు కు బెంగళూరుకు చెందిన బ్రిటన్ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రధానం చేసినారు. గౌస్ పీర్ యువతకు పేదలకు తన వంతు చేసిన సేవలను గుర్తించిన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ జబీబుల్లా చేతుల మీదుగా డాక్టరేట్ ను ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గౌస్ పీరు కు లభించిన గౌరవాన్ని మండల స్థానికులు, యువకులు గౌస్ పీర్ కు శుభాకాంక్షలు తెలిపి తమ ఆర్షం వ్యక్తం చేసినారు.

## మెగా జాబ్ మేళా కార్యక్రమంలో పాల్గొన్న
# ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే  డాక్టర్ వి.ఎం థామస్




**వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**
ఎస్ఆర్ పురం మెగా జాబ్ మేళా కార్యక్రమానికి విచ్చేసినటువంటి జీడి నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ వి.ఎంథామస్‌ని, వారి సతీమణి శాంతి రెడ్డిని సత్కరిస్తున్న వెదురు కుప్పం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి, వెదురుకుప్పం మండలం తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంట గురుకుల పాఠశాల
# ఆకస్మిక తనిఖీ చేసిన బొజ్జల బృందమ్మ



**రేణిగుంట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్13:**
రేణిగుంట గురుకుల పాఠశాలను మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి, ఎమ్మెల్యే తల్లి బొజ్జల బృందమ్మ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతి సదుపాయాలు, భోజన నాణ్యత,విద్యా ప్రమాణాలపై సమగ్ర తనిఖీ చేశారు. హాస్టల్ గదులు, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు,తాగునీటి సౌకర్యాల పరిశీలించారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు పట్టికలు, పరిశుభ్రత అంశాలపై సమీక్షించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి బొజ్జల బృందమ్మ వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. భోజన నాణ్యత మెరుగుపరచా లని, హాస్టల్ పరి సరాల్లో శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, చదువులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.గురుకుల విద్యార్థులకు నాణ్య మైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్యనించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**
కుప్పం మున్సిపాలిటీ పరిధిలోనీ 12వ వార్డులో ప్రతి ఒకరికి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు యూనిట్ ఇంచార్జ్ మనీ, వార్డు ఇంచార్జీ రవి, ఏఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలో వార్డుల వారీగా బ్లడ్ శాంపిల్స్ కలెక్ట్ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఒకసారి రక్త పరీక్ష చేసుకుంటే 49 టెస్టులకు సంబంధించిన పూర్తి రిపోర్ట్ ఇవ్వడం జరుగుతుందని, ఉచితంగా రక్త పరీక్షలు చేసి వారి మొబైల్ నెంబర్లకు రిపోర్ట్ పంపడం జరుగుతుందన్నారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**



కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ఎన్టీఆర్ కాలనీకు చెందిన మంగమ్మ అనారోగ్యం తో మృతి చెందారు. మంగమ్మ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని యూనిట్ ఇంచార్జ్ మనీ, వార్డు ఇంచార్జీ రవి, ఏఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్ అన్నారు. మంగమ్మ మృతదేహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంగమ్మ కుటుంబాన్ని  పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీ నాయకుల తరుపున మంగమ్మ అంత్యక్రియలకు 10,000 ఆర్థిక సాయన్ని యూనిట్ ఇంచార్జ్ మనీ, వార్డు ఇంచార్జీ రవి, ఏఎంసి డైరెక్టర్ ఇర్ఫాన్ అందచేశారు.

## స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025లో
# కేఈసీ బృందానికి ప్రథమ బహుమతి





**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**
కుప్పం ఇంజినీరింగ్ కాలేజ్ (కెఈసి)కు చెందిన ఫైనల్ ఇయర్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసిఈ) విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ (ఎస్ ఐ హెచ్ ) 2025 – గ్రాండ్ ఫినాలేలో ప్రథమ బహుమతి సాధించి రూ.1.50 లక్షలనగదు పురస్కారం గెలుచుకున్నారు. ఈ గ్రాండ్ ఫినాలే డిసెంబర్ 8నుండి 12వరకు తమిళనాడులోని సత్యమంగళం, ఈరోడ్ జిల్లాలో ఉన్న బన్నారిఅమ్మన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహిం చబడింది.హార్డ్వేర్ కేటగిరీలో,స్మార్ట్ ఎడ్యు కేషన్ థీమ్ కింద రూపొందిం చిన “క్లాస్ లెన్స్ ముఖ గుర్తింపు ఆధారిత స్మార్ట్ అటెండెన్స్ సిస్టమ్” ప్రాజెక్టుతో కేఈసీ బృందం ఈ విజయం సాధించింది. విద్యా సంస్థల్లో హాజరు వ్యవస్థనుమరింత సమర్థవంతంగా, విశ్వసనీయంగా, సాంకేతికంగా మెరుగుపరచే ఈ వినూత్న పరి ష్కారం న్యాయనిర్ణేతలను ఆకట్టుకుంది. ఈ విజయం సాధించిన విద్యార్థులు కె.ఉదయ్ భాస్కర్, పి.శ్రవ్య, కె.ఎస్. కల్పన, పి.వి.హేమంత్, కె.సాయి చందు, ఎన్. చాందిని. ఈ బృందానికి డా. జి. ఎన్. కోదండ రామయ్య, డా.పి.అజయ్ కుమార్, జి.వివేక్ అమూల్యమైన మార్గదర్శకత్వం అందించగా, ఎస్ఐహెచ్ ఎస్.పి.ఓ.సిగా డా.వి.శేఖర్ కీలక పాత్రపోషించారు. విజయోత్సవ (వ్రాలెడిక్టరీ) కార్యక్రమానికి బన్నారి అమ్మన్ గ్రూప్ చైర్మన్ ఎస్.వి. బాలసుబ్రమణ్యం, అలాగే కేంద్ర విద్యా శాఖ ఇన్నోవేషన్ సెల్ ఇన్నోవేషన్ ఆఫీ సర్ సరీమ్ మెయిన్, అద్వైత్ టెక్స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రవి సామ్,వెర్సా డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సుందర్ మురుగానందన్, ఎంఓ ఈ/ఏఐసీటీఈ స్టార్ట్–అప్ ఫెలో ఉద్యాన్ మౌర్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బి.సి.నాగరాజ్, వైస్–చైర్మన్ డా. ఎన్. సునిల్రాజ్,కార్యదర్శి ఎన్. సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డా. ఎస్. సుధాకర్ బాబు, డైరెక్టర్ డా.జి.ఎన్. కోదండ రామయ్య ఆధ్వర్యంలోని కేఈసీ యాజమాన్యం, అధ్యాపకులు విద్యార్థులనుఅభినందిస్తూ, కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చినందుకు ప్రశంసించారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**




కుప్పం వారియర్స్ లయన్స్ క్లబ్ పేస్ అర్బన్ సెంటర్, కుప్పం వద్ద ఉచిత కంటి & డయాబెటిక్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించింది. కుప్పంలయన్స్ క్లబ్  డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ డా.మహేష్ మాట్లాడుతూ.. మొత్తం 60 మంది రోగులను పరీక్షించారు, మరియు 10 మంది రోగులను పి ఇ ఎస్ మెడికల్ కాలేజ్ %ది% హాస్పిటల్ సహకారంతో  ఫాకో సర్జరీకి సిఫారసు చేశారు. ఆరోగ్య పరీక్షల కోసం వచ్చిన అందరి రోగులు మరియు హాజరైన వారికి లయన్ సతీష్, లక్ష్మి నారాయణ హోటల్ వారి చే భోజనాన్ని అందించడం జరిగిందన్నారు.

## శివయ్యను దర్శించుకున్న
# కర్ణాటక హైకోర్టు  న్యాయమూర్తి వెంకటేష్ నాయక్



**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**
శ్రీకాళహస్తి దేవస్థానం దర్శనార్థమై హైకోర్టు ఆఫ్ కర్ణాటక న్యాయమూర్తివెంకటేష్ నాయక్, కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి ఇచ్చేశారు వీరిని ఆలయ అధికారులు దక్షిణ గోపురం వద్ద వేద పండితులచే పున్నమితో స్వాగతం పలికి న్యాయ మూర్తి వారి కుటుంబ సభ్యులు జ్ఞానప్రసూనాంబ సమేత వాయు లింగేశ్వరుని దర్శించుకున్నారు. అనంతరం మృత్యుంజయ ఆలయ ప్రాంగణమునందు న్యాయమూర్తి వారి కుటుంబ సభ్యులకు వేద పండితులు ఆశీర్వాదం ఇవ్వగా స్వామి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ అధికారులు ఈ కార్యక్రమంలో ఆలయ  ప్రోటోకాల్ ఏఈఓ మోహన్, ఏపీఆర్ఓ శ్రీనివాసులు, స్థానిక కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.

## చెంచయ్య నాయుడు ప్రమాణ స్వీకానికి
# భారీగా తరలివచ్చిన గిరిజనులు

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:**



శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రినారా చంద్రబాబు నాయుడు  విద్యా శాఖ మంత్రి అండ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు వ్యవసాయ శాఖ మంత్రి కే. అచ్చం నాయుడు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసులు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గం శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి  ఆశీస్సులతో శనివారం ఉదయం శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్‌గా రంగినేని చెంచయ్యనాయుడు, డైరెక్టర్‌గా వెగ్రి రమేష్ ప్రమాణ స్వీకారానికి భారీగా గిరిజనులతో హాజరైన  ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య శుభాకాంక్షలు తెలియజేశారు.

# అప్పుడు వద్దు... ఇప్పుడు ముద్దా...

**కడప :** షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ అనే కంపెనీ పేరు వింటే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు జగన్ గుర్తుకు వస్తారు. వైఎస్ఆర్‌సీపీ హయాంలో ఈ కంపెనీకి ఏపీలో అగ్ర తాంబూలం దక్కింది. పవర్ రంగానికి చెందిన కాంట్రాక్టులు, ట్రాన్స్ ఫార్మర్ల సరఫరా చేసే కాంట్రాక్టులు అన్నీ ఈ కంపెనీకే దక్కేవి. టీడీపీ నేతలు కూడా తీవ్రంగా ఆరోపణలు చేసేవారు. టీడీపీ రాగానే ఆ కంపెనీ అక్రమాలన్నీ బయటకు తీస్తారని అనుకున్నారు. కానీ ఆ కంపెనీకి టీడీపీ ప్రభుత్వంలోనూ ప్రాధాన్యత లభిస్తోంది. తాజాగా వంద కోట్లకుపైగా స్టాంప్ డ్యూటీని మినహాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ అనుబంధ సంస్థ అయిన సూర్యచక్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు భారీ స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇచ్చింది. ఈ మినహాయింపు మొత్తం రూ. 104.51 కోట్లు. ఈ మేరకు జీవోలు జారీ అయింది. షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ ఇప్పటికే శ్రీసిటీ లో రూ. 3,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టి సోలార్ ప్యానల్స్ ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటోంది. ఇప్పుడు కంపెనీ తన అనుబంధ సంస్థ సూర్యచక్ర డెవలపర్స్ ద్వారా కొత్తగా మరో రూ. 2,000 కోట్ల పెట్టుబడి పెడతామని మినహాయింపులు కోరింది. ప్రభుత్వం డిసెంబర్ 2025లో జారీ చేసిన ఊ ఓబ. ఔనీ. 9 ప్రకారం.. 5,000 ఎకరాలకు పైగా కాకుండా కొనుగోలు చేసే భూమికి 100 శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇస్తున్నారు. సూర్యచక్ర డెవలపర్స్ కొనుగోలు చేసిన భూమి విలువ రూ. 1,045 కోట్లు కాగా, దానిపై వచ్చే స్టాంప్ డ్యూటీ పూర్తిగా మాఫీ చేశారు. దీని వల్ల ఆ కంపెనీకి రూ. 105 కోట్ల లాభం ఉంటుంది. షిరిడీసాయికి ఇది మొదటిసారి కాదు. గతంలోనూ 2021?23 మధ్య అంటే జగన్ హయాంలోనూ ఈ కంపెనీకి సుమారు రూ. 200 కోట్లకు పైగా స్టాంప్ డ్యూటీ, ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీలు మాఫీ చేశారు. మొత్తం మీద ఈ కంపెనీకి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 300 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు వచ్చాయి.టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత షిరిడి సాయి



ఎలక్ట్రికల్స్ కు 8,365 ఎకరాల భూమి కేటాయించారు. పదేళ్ల కిందట షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ట్రాన్స్ ఫార్మర్లు తయారు చేసే కంపెనీ. తర్వాత భారీ విద్యుత్ కంపెనీగా మారింది. విద్యుత్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు కడతామని ఒప్పందాలు చేసుకుంది. ఈ కంపెనీ నర్రెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి అనే వ్యక్తికి చెందినది. రామయపట్నం వద్ద సోలార్ ప్లేట్లు తయారు చేస్తామంటూ ఓ కంపెనీ షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ఇండో సోల్ పేరుతో ప్రారంభించింది. పది లక్షల అథరైజ్డ్ క్యాపిటల్‌తో ప్రారంభమైన ఈ కంపెనీ పెద్ద ఎత్తున భూముల్ని తీసుకుంది. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు షిరిడిసాయి ఎలక్ట్రికల్స్‌కు కడప నగరానికి ఆనుకుని ఉన్న ఐటీ సెజ్ భూములు.కానీ డీ నోటిఫై చేసి 49.8 ఎకరాలను కేటాయించారు. సోమశిల వద్ద కూడా షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సోమశిల వద్ద 900 మెగావాట్ల ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. అల్లూరి సీతారామరాజుజిల్లా ఎర్రవరం వద్ద 1200 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును షిరిడి సాయి సంస్థకు ప్రభుత్వం నామినేషన్ పద్దతిలో జగన్ ప్రభుత్వం కేటాయించింది. ఇది చట్ట విరుద్ధమని టీడీపీ ఆరోపించింది.ఈ కంపెనీ తీరుపై పవన్ కల్యాణ్ విచారణకు కూడా ఆదేశించారు. శేషాచలం వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతోందని ఫిర్యాదులు ఉన్నాయి. తమ హయాంలో తమ బినామీ అని ప్రచారం చేసినా.. ఇప్పుడు ఆ సంస్థకు పెద్ద ఎత్తున భూములు, రాయితీలు కల్పించడాన్ని వైసీపీ కూడా ప్రశ్నించడం లేదు. ఆ సంస్థకు మద్దతుగానే వైసీపీ ఉంది. అంటే.. రెండు పార్టీలకూ షిరిడిసాయి దగ్గర సంస్థ అని అర్థమవుతోంది. కానీ ఆరోపణలు చేసిన టీడీపీ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# వేమిరెడ్డే ఎందుకు టార్గెట్

**నెల్లూరు :** వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నాన్ కాంట్రవర్సీ లీడర్. మంచి బిజినెస్ మెన్ కూడా. 2018 వరకు పాలిటిక్స్‌తో సంబంధం లేని వ్యాపారవేత్తగా ఉన్న ఆయన..అందరి వాడిగా ఉంటూ వచ్చారు. 2019లో పొలిటికల్ అరంగేట్రం చేసి వైసీపీ నుంచి ఎంపీ అయ్యారు. ఆ తర్వాత జగన్‌తో విభేధించి టీడీపీ గూటికి చేరి 2024లోనూ ఎంపీగా గెలిచారు. ఎప్పుడైతే ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి..సైకిల్ ఎక్కారో అప్పటినుంచి వేమిరెడ్డి..వైసీపీకి తెగ టార్గెట్ అయిపోయారట. ఒకప్పుడు వైసీపీలో ఆయనకు సన్నిహితులుగా ఉన్న నేతలంతా ఇప్పుడు ప్రత్యర్థులు అయ్యారన్న టాక్ వినిపిస్తోంది. ఆర్థికంగా బలవంతుడగా..మంచి పేరున్న లీడర్‌గా ఉన్న వేమిరెడ్డి..సైకిల్ ఎక్కడం తమకు పెద్ద మైనస్ అయిందని వైసీపీ రగిలిపోతోందట. అందుకే నెల్లూరు జిల్లా ఫ్యాన్ పార్టీ లీడర్లే కాదు..వైసీపీ అధినేత జగన్ కూడా ఆయన్నే టార్గెట్ చేస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో అంగబలం, అర్థబలం రెండూ జతకలసి టీడీపీకి అంది వచ్చిన అస్త్రంగా మారడం వల్లే..వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వైసీపీకి టార్గెట్ అయ్యారన్న చర్చ జరుగుతోంది.ఆ మధ్య వేమిరెడ్డి రూ.400 కోట్లతో క్వార్ట్జ్ ఫ్యాక్టరీ పెట్టి..వెయ్యి మందికి ఉపాధి కల్పించాలని అనుకున్నారు. వైసీపీ నేతలు ఆ క్వార్ట్జ్ ఫ్యాక్టరీ అనుమతులు, వ్యాపారంపై ఓ రేంజ్‌లో విమర్శలు, ఆరోపణలు చేశారు. దీంతో మంచి చేద్దామని..సొంత డబ్బుతో సేవ చేద్దామని ముందుకొస్తే తనపైనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని హర్ట్ అయిపోయారాయన. తనకు అవినీతి చేయాల్సిన అవసరం లేదంటూ..క్వార్ట్జ్ ఫ్యాక్టరీ ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నారు. మాటలు పడలేకే క్వార్ట్జ్ బిజినెస్‌ను ఆపేస్తున్నట్లు అప్పట్లోనే ప్రకటించేశారు. ఆ ఇష్యూ తర్వాత సమయం, సందర్భం దొరికిన ప్రతీసారి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని టార్గెట్ చేస్తూనే ఉన్నారు వైసీపీ నేతలు. ఆ మధ్య వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి..వేమిరెడ్డి సతీమణి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. ఏకంగా ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి మీద దాడి జరిగింది. ఆయనపై ప్రశాంతిరెడ్డి కేసు కూడా పెట్టారు. ప్రసన్నకుమార్ రెడ్డి..ప్రశాంతిరెడ్డిపై ఫిర్యాదు చేశారు. వారం రోజుల పాటు అప్పట్లో ఆ ఇష్యూ వేమిరెడ్డి దంపతుల చుట్టే తిరిగింది. తర్వాత వైసీపీ నేతల తీరుపై



విమర్శలు వెల్లువెత్తాయి.ఇక ఇప్పుడు లేటెస్ట్‌గా తిరుమల కల్తీ నెయ్యి కేసులో..వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్న అరెస్ట్ వ్యవహారం..నెమ్మదిగా వేమిరెడ్డి వైపు మళ్లించే కుట్ర జరుగుతుందని ఆరోపిస్తోంది టీడీపీ. తిరుమల లడ్డూ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ పోలీసుల అదుపులో ఉన్న చిన్న అప్పన్న..ఎంపీ వేమిరెడ్డి పీఏ అంటూ జగన్ చేసిన విమర్శలు చర్చకు దారి తీశాయి. దీంతో వేమిరెడ్డే డైరెక్టుగా మీడియా ముందుకు వచ్చి..వైసీపీ అధినేతకు బిగ్ సవాల్ చేశారు. ఫస్ట్ టైమ్ జగన్ మీద డైరెక్ట్ అటాక్ చేసిన వేమిరెడ్డి..తన మనసు రగిలిపోతోందని..అందుకే..జగన్‌పై కామెంట్లు చేయాల్సి వస్తోందని చెప్పుకొచ్చారు. చిన్న అప్పన్నకు తాను డబ్బులు ఇచ్చిన మాట వాస్తవమేనని వేమిరెడ్డి.. అప్పన్న కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంటే సాయం చేశానన్నారు. సేవాభావంతోనే అప్పన్న కుటుంబానికి రూ.50 వేలు ఇచ్చినట్లు చెప్పారు. తానేదో తప్పు చేసినట్టు జగన్ మాట్లాడారని మండిపడ్డ వేమిరెడ్డి..తనపై చేసిన ఆరోపణలపై దేవుడి ముందు ప్రమాణం చేయాలంటూ సవాల్ చేశారు.వైసీపీని వీడినప్పటి నుంచి వేమిరెడ్డి దంపతులు ఇద్దరూ రాజకీయంగా ఒడిదుడుకులు ఎదుర్కొన్నా.. నిలదొక్కుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. ఇటు తమ నియోజకవర్గాల్లోనూ..అటు ప్రజల్లోనూ వారి గ్రాఫ్ పెరుగుతోందే తప్ప..ఎక్కడా మైనస్ కావడం లేదంటూ ప్రత్యర్థులు అసూయ పడుతున్నారట. స్వయంగా చేస్తున్న సాయాలు కొన్నయితే..రాజకీయ నాయకులుగా పనులు కూడా వారి ఇమేజ్‌ను అంతకంతకు పెంచుతున్నాయట. అంతేకాదు..ప్రత్యర్థులు చేస్తున్న పాలిటిక్స్ కూడా వారికే రివర్స్ అవుతున్నాయని అంటున్నారు. అప్పుడు ప్రసన్న కుమార్ రెడ్డి కామెంట్స్ అయినా..ఇప్పుడు జగన్ ఆరోపణలు అయినా..క్వార్ట్జ్ ఫ్యాక్టరీ విషయంలో అయినా.. వేమిరెడ్డికే ప్లస్ పాయింట్ అయింది తప్ప..ఆయన ఇమేజ్‌కు వచ్చిన ఇబ్బందేమి లేదని తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు. ఇలా ఇష్యూ ఏదైనా ఏడాదిన్నర కాలంలో వేమిరెడ్డి వైసీపీకి టార్గెట్ అవడం అయితే పొలిటికల్ హాట్ టాపిక్‌గా నడుస్తోంది.

# మళ్లీ మొదటికొచ్చిన రాజీనామాలు

**ఏలూరు**

ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో రాజీనామాల వ్యవహారం ఒక అంతులేని న్యాయ పోరాటంగా మారుతోంది. తమ రాజీనామాలను ఆమోదించాలంటూ పలువురు ఎమ్మెల్సీలు కోరుతుండగా, మండలి ఛైర్మన్ మోషేన్ రాజు తీసుకుంటున్న నిర్ణయాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. హైకోర్టు సింగిల్ బెంచ్ గడువు విధించడంతో ఈ వివాదానికి తెరపడుతుందని భావించిన తరుణంలో, ఛైర్మన్ అనూహ్యంగా అప్పీల్ దాఖలు చేయడం ద్వారా ఈ ఎపిసోడ్‌కు కొత్త ట్విస్ట్ ఇచ్చారు. దీంతో ఇప్పట్లో రాజీనామాల ఆమోదం ఉండకపోవచ్చనే సంకేతాలు వెలువడుతున్నాయి.దాదాపు ఏడాది క్రితం ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసిన జయమంగళ వెంకట రమణ తదితరులు, తమ లేఖలను ఛైర్మన్ ఆమోదించడం లేదని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ బెంచ్, నాలుగు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని మండలి ఛైర్మన్‌ను ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు మోషేన్ రాజు రాజీనామా చేసిన సభ్యులను పిలిపించి, వారి వివరణ తీసుకున్నారు. దీంతో రాజీనామాల ఆమోదం లాంఛనమే అని అంతా భావించారుకానీ, ఇక్కడే అసలు కథ మొదలైంది. స్పీకర్ లేదా ఛైర్మన్ నిర్ణయాధికారాల్లో న్యాయస్థానాలు కాలపరిమితిని విధించలేవన్న వాదనతో మోషేన్ రాజు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన వేసిన ఈ పిటిషన్, రాజీనామాల ప్రక్రియను మళ్లీ నిలిపివేసింది. ఫిరాయింపుల చట్టం లేదా రాజీనామాల ఆమోదం విషయంలో అసెంబ్లీ స్పీకర్ లేదా మండలి ఛైర్మన్‌కు ఉండే విశేష అధికారాలుంటాయి. అయితే వాళ్లు నిర్ణయం తీసుకోకుండా నిరవధికంగా జాప్యం చేస్తుంటే న్యాయస్థానాల జోక్యం చేసుకోవడం మరో అంశం. గతంలో సుప్రీంకోర్టు నిర్ణీత గడువులోగా శాసనసభాధిపతులు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అయితే, తన పరిధిలోని అంశాల్లో కోర్టు గడువు విధించడం సరికాదన్నది ఛైర్మన్ వాదనగా కనిపిస్తోంది. ఈ సాంకేతిక అంశాన్ని అడ్డం పెట్టుకుని రాజీనామాల ఆమోదాన్ని మరింత ఆలస్యం చేయడమే వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు.రాజీనామా చేసిన ఎమ్మెల్సీల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా మారింది. వాళు రాజకీయంగా వేరే పార్టీలో చేరాలన్నా, సాంకేతికంగా ఇంకా మండలి సభ్యులుగానే కొనసాగుతుండటం వారికి ఇబ్బందికరంగా మారింది. రాజీనామా ఆమోదం పొందితే, ఖాళీ అయిన స్థానాలకు ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ, ఈ జాప్యం వల్ల ఆ అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. కోర్టు తదుపరి విచారణను 18వ తేదీకి వాయిదా వేసింది. అక్కడ కూడా వెంటనే తీర్పు రాకపోతే, ఈ వ్యవహారం నెలల తరబడి సాగే అవకాశం ఉంది.మండలిలో ప్రస్తుతం ఉన్న బలాబలాలు, భవిష్యత్తులో జరగబోయే మార్పులను దృష్టిలో ఉంచుకునే ఈ జాప్యం జరుగుతోందనే వాదన బలంగా వినిపిస్తోంది. రాజీనామాలను వెంటనే ఆమోదిస్తే, అధికార కూటమికి రాజకీయంగా మైలేజ్ దక్కే అవకాశం ఉంది. అందుకే, న్యాయపరమైన చిక్కులను చూపిస్తూ, ఈ ప్రక్రియను సాధ్యమైనంత వరకు సాగదీయడమే వైసీపీ వ్యూహంగా కనిపిస్తోంది.మొత్తానికి, హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు తర్వాత సానుకూల నిర్ణయం వస్తుందని ఆశించిన ఎమ్మెల్సీలకు, ఛైర్మన్ అప్పీల్ నిర్ణయం శరాఘాతంలా తగిలింది. ఈ వ్యవహారం న్యాయస్థానాల పరిధిలోకి వెళ్లినందున, ఇక ఇప్పట్లో తెగేలా లేదు. డివిజన్ బెంచ్ ఎలాంటి తీర్పు ఇస్తుంది? రాజీనామాలపై ఛైర్మన్ అంతిమ నిర్ణయం ఎప్పుడు తీసుకుంటారు? అన్నది తేలాలంటే మరికొంత కాలం వేచి చూడక తప్పదు. అప్పటి వరకు రాజీనామా చేసిన ఎమ్మెల్సీలకు నిరీక్షణ తప్పదు.

## భూములివ్వకుంటే సేకరణే!

రాజధాని అమరావతి రైతులు ఎదుర్కొంటున్న దీరకాలిక సమస్యల పరిష్కారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద ృష్టి సారించాయి. ఈ అంశంపై ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సమావేశం అనంతరం కేంద్ర గ్రామీణాభివ ృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కీలక విషయాలు వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇప్పటికీ భూములు ఇవ్వని రైతులతో మరోసారి చర్చలు జరుపుతామని, ఒకవేళ వారు అంగీకరించకపోతే వచ్చే నెల మొదటి వారంలో భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేయాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన పెమ్మసాని, సుమారు 2,400 ఎకరాల భూమి ఇంకా ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాలేదని తెలిపారు. వీధిపోటు వంటి సమస్యలున్న ప్లాట్లకు ఒకసారి మార్పులు చేసే అవకాశం కల్పిస్తామని రైతులకు సూచించారు. అయితే, "ప్రతి నెలా వాస్తు మార్పులు చేయడం సాధ్యం కాదు. సమస్యలు ఉన్నవారు ఒకేసారి వచ్చి పరిష్కరించుకోవాలి" అని ఆయన తేల్చి చెప్పారు. జరీబు భూముల సమస్య పరిష్కారానికి నెల రోజుల సమయం పడుతుందని, సాయిల్ టెస్ట్ తర్వాత తుది నిర?యం తీసుకుంటామని తెలిపారు. తాడికొండ బైపాస్ నిర్మాణం వల్ల నష్టపోయిన రైతులకు టీడీఆర్ బాండ్లు అందజేస్తామని పెమ్మసాని భరోసా ఇచ్చారు. హెల్త్ కార్డుల అంశంపై గ్రామసభలు నిర్వహించి నిర?యిస్తామని చెప్పారు. గ్రామాల్లో డీపీఆర్ ప్రకారం మౌలిక సదుపాయాల కల్పన, ఎల్పీఎస్ ప్రాంతాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటు త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 18 కమ్యూనిటీ హాళ్లు, శ్మశానాల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి వివరించారు.

## ఉదయం విజ్ఞప్తి.. సాయంత్రం రోడ్డు

-మొదటిపేజీ తరువాయి

ఉదయం విజ్ఞప్తి చేయగా.. ఆ సాయంత్రానికే రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇచ్చేలా పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవడంతో దీపికతో పాటు ఆ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో డిసెంబర్ 12వ తేదిన క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బందితో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించారు. ఒక్కో క్రికెటర్‌కు రూ. 5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు. అంతేకాకుండా, ప్రతి మహిళా క్రికెటర్‌కు పట్టు చీర, శాలువాతో పాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను కూడా అందించి వారిని ప్రత్యేకంగా సత్కరించారు.

## అమరావతికి అడ్డంకులు క్లియరైనట్టేనా

-మొదటిపేజీ తరువాయి

చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై అటు కేంద్రం నుంచి కానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి ప్రకటనలు చేయలేదు. టీడీపీ వర్గాలు కూడా సైలెంట్‌గా ఉన్నాయి. కేంద్రానికి బిల్లు పంపిన సంగతిని మాత్రం ఇప్పటికే ప్రకటించారు. పీ క్యాబినెట్ మే 19, 2025న అమరావతిని రాజధానిగా గుర్తించే రెజల్యూషన్ ఆమోదించి, కేంద్రానికి పంపింది. ఈ రెజల్యూషన్‌లో 2014-2024 వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్న విషయాన్ని పేర్కొంటూ, 2024 తర్వాత అమరావతిని ఏకైక క్యాపిటల్‌గా చట్ట చేయానలని కోరుతున్నారు. కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లుగా తెలుస్తోంది. కేంద్రం 2014 చట్టం సెక్షన్ 5(2)ను సవరించే బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ బిల్లు అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా గుర్తిస్తూ, భవిష్యత్ ప్రభుత్వాలు రాజధాని మార్చకుండా రక్షణ ఇస్తుంది. అయితే, రెట్రోస్పెక్టివ్‌గా 2014 నుంచే అమరావతిని గుర్తించాలా లేక 2024 నుంచా అనే టెక్నికల్ ఇష్యూస్ వల్ల ఆలస్యమవుతోంది. యూనియన్ లా మినిస్ట్రీ డ్రాఫ్ట్ బిల్లుపై కొన్ని ప్రశ్నలు లేవ ని, సరైన లీగల్ జస్టిఫికేషన్‌తో మళ్లీ సమర్పించమని చెప్పింది.నవంబర్ 22, 2025న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోం మంత్రి అమిత్ షాతో చర్చించారు. డ్రాఫ్ట్ బిల్లు యూనియన్ లా డిపార్ట్‌మెంట్ పరిశీలనలో ఉంది. ఈ బిల్లు యూనియన్ క్యాబినెట్ ముందుకు రానుందని, తదుపరి పార్లమెంట్ సెషన్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కేంద్ర మంత్రి వర్గంలో బిల్లు చర్చించిన తర్వాత పూర్తి స్పష్టత వస్తుందని అధికారుల అంచనా.

## సంక్రాంతి పండుగకు భారీగా ట్రైన్స్

**విజయవాడ :** సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. సాధారణంగా టికెట్లు దొరకని ఈ సమయంలో.. ఈ రైళ్లు ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తాయి. సికింద్రాబాద్-అనకాపల్లి (జనవరి 4, 11, 18 తేదీల్లో), హైదరాబాద్-గోరఖ్‌పూర్ (జనవరి 9, 16, 23 తేదీల్లో) రూట్లలో ఈ రైళ్లు నడుస్తాయి. ఈ ప్రత్యేక రైళ్లకు విజయవాడ, ఖమ్మం, వరంగల్, నిజామాబాద్ వంటి స్టేషన్లలో స్టాప్‌లు ఉంటాయి. ప్రయాణికులు ముందుగానే రిజర్వేషన్ చేసుకుని ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చు.సంక్రాంతి పండుగ సమయంలో రైలు ప్రయాణం అనేది తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వాసులకు పెద్ద సవాలు. హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో ఉద్యోగాలు చేసేవారు అధిక సంఖ్యలో తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో.. ఆ సమయంలో రైలు రిజర్వేషన్ టికెట్స్ దొరకడం చాలా కష్టంగా ఉంటుంది. ఒక వేళ బుక్ చేసుకున్నా.. వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం సాధారణంగా కనిపిస్తుంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకుల రద్దీని తగ్గించేందుకు ముందస్తుగా కొన్ని ప్రత్యేక రైళ్లను ప్రకటించింది.సంక్రాంతి పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ముఖ్య ప్రాంతాలకు (విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, విజయవాడ వంటివి) అనుసంధానం చేస్తూ ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ఈ రైళ్ల షెడ్యూల్ వివరాలను రైల్వే ప్రకటించింది. అందులో ఒకటి.. సికింద్రాబాద్- అనకాపల్లి మధ్య స్పెషల్ (07041/07042) ట్రైన్. రైలు నంబర్ 07041 సికింద్రాబాద్- అనకాపల్లి వరకు.. 2026 జనవరి నెలలో ఆదివారాల్లో అంటే జనవరి 4, 11, 18 తేదీల్లో ఈ రైలు నడుస్తుంది. రైలు నంబర్ 07042 అనకాపల్లి- సికింద్రాబాద్ వరకు.. 2026 జనవరి నెలలో సోమవారాలు అంటే జనవరి 5, 12, 19 తేదీల్లో నడుస్తుంది.ఇక హైదరాబాద్-గోరఖ్‌పూర్ స్పెషల్ (07075/07076) ట్రైన్ విషయానికి వస్తే.. రైలు నంబర్ 07075 హైదరాబాద్- గోరఖ్‌పూర్ వరకు.. జనవరి నెలలో శుక్రవారాల్లో అంటే జనవరి 9, 16, 23 తేదీల్లో నడుస్తుంది. రైలు నంబర్ 07076 గోరఖ్‌పూర్ ? హైదరాబాద్ మధ్య.. జనవరి నెలలో ఆదివారాల్లో అంటే జనవరి 11, 18, 25 తేదీల్లో నడుస్తుంది.మచిలిపట్నం- అజ్మీర్ మధ్య స్పెషల్ (07274/07275) ట్రైన్.. రైలు నంబర్ 07274 మచిలీపట్నం- అజ్మీర్ వరకు.. ఈ రైలు 2025 డిసెంబర్ 21వ తేదీన (ఆదివారం) ప్రయాణిస్తుంది. రైలు నంబర్ 07275 అజ్మీర్-మచిలీపట్నం వరు.. ఈ రైలు 2025 డిసెంబర్ 28వ తేదీన నడుస్తుంది.ఈ ప్రత్యేక రైళ్లు పలు ముఖ్యమైన స్టేషన్లలో ఆగుతాయి. ఉదాహరణకు.. సికింద్రాబాద్-అనకాపల్లి రూట్‌లో ఇవి గుడివాడ, విజయవాడ, ఖమ్మం, డోర్నకల్ వంటి స్టేషన్లలో ఆగుతాయి. అదేవిధంగా.. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రత్యేక రైళ్లు మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, బాసర్, ధర్మాబాద్, నాందేడ్, పర్భాని, జాల్నా, సంభాజీనగర్, మన్మాడ్, భుసావల్, భోపాల్, ఉజ్జయిని వంటి అనేక కీలక స్టేషన్‌లలో స్టాప్‌లు కలిగి ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది.రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థమే ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. రద్దీని బట్టి భవిష్యత్తులో మరిన్ని రైళ్లను నడిపేందుకు చర్యలు చేపడతామని కూడా హామీ ఇచ్చారు. పండుగకు ముందుగానే ఈ ప్రత్యేక రైళ్లలో టికెట్లను రిజర్వేషన్ చేసుకోవడం ద్వారా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చు

## ఆ రెండు జైళ్లు వీఐపీలు

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో, రాష్ట్రం లోని రెండు ప్రధాన కారాగారాలు?విజయవాడ జిల్లా జైలు ,నెల్లూరు సెంట్రల్ జైలు?అనూహ్యంగా ఎక్కువ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించిన కేసులు పెరగడం, వాటిలో రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు రిమాండ్‌కు వెళ్లడం వల్ల ఈ జైళ్లు వార్తల్లో నిలుస్తున్నాయి. ఒకప్పటి వరకు సాధారణ నేరస్తులే ఎక్కువగా ఉండే ఈ జైళ్లలో ఇప్పుడు వీఐపీలు, రాజకీయ నాయకుల రాకపోకలు పెరగడంతో వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఇటీవలి కాలంలో నెల్లూరు జైలులో మళ్లీ హల్‌చల్ మొదలైంది. మాచర్లకు చెందిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు సహా పలువురు రిమాండ్ ఖైదీలుగా అక్కడికి చేరుకోవడం చర్చనీయాంశమైంది. అంతకు ముందు నెల్లూరు సెంట్రల్ జైలు పెద్ద కేసుల కోసం ఎక్కువగా వినియోగించబడేది కాదు. విశాఖపట్నం రాజమండ్రి , కడప జైళ్లలోనే ముఖ్య నిందితులను ఉంచేవారు. కానీ తాజాగా నెల్లూరు, విజయవాడ జైళ్లపైనే అధిక భారం పడుతోంది.

## బిజినెస్

### నవంబర్‌లో 0.71 శాతానికి పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం



దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల స్వల్పంగా పెరిగింది. అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో 0.25 శాతం కనిష్టానికి చేరిన వినియోగదారుల ధరల సూచీ ఆధారిత రిటైల్(సీపీఐ) ద్రవ్యోల్బణం నవంబర్‌లో 0.71 శాతానికి చేరింది. కూరగాయలు, ఇంధన ధరలు పెరగడమే ఇందుకు కారణమని శుక్రవారం కేంద్ర గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) డేటాను విడుదల చేసింది. కూరగాయలతో పాటు ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాల ధరలు కూడా ప్రభావితం చేశాయి. అయినప్పటికీ ద్రవ్యోల్బణం భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) లక్ష్యం 4 శాతం కంటే తక్కువగా ఉండటం ఇది వరుసగా 10వ నెల. మొత్తం రిటైల్ ద్రవ్యోల్బణంలో అధిక భాగం కలిగిన ఆహార పదార్థాల ధరలు −3.91 శాతంగా, కూరగాయల ధరలు −22.20 శాతంగా నమోదయ్యాయని గణాంకాలు తెలిపాయి. పప్పుధాన్యాలు, రవాణా, కూరగాయలు, ధాన్యాల ధరలు తగ్గడం వల్ల మొత్తంగా ఆహార, రిటైల్ ద్రవ్యోల్బణం తక్కువగా నమోదయ్యేందుకు ప్రధాన కారణమని ఎన్ఎస్ఓ వెల్లడించింది.

### జనవరి నుంచి కార్ల ధరలను 2 శాతం పెంచిన మెర్సిడెస్ బెంజ్



ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ కార్ల ధరలు పెంచుతున్నట్టు ప్రకటించింది. యూరోతో పోలిస్తే రూపాయి విలువ బలహీనపడటం వల్ల కార్ల సరఫరాలో ఖర్చులు పెరుగుతున్నాయని, దీన్ని భర్తీ చేసేందుకు 2026, జనవరి నుంచి అన్ని కార్లపై 2 శాతం పెంపు అమలు చేయాలని నిర్ణయించామని కంపెనీ శుక్రవారం ప్రకటనలో తెలిపింది. ఫారెక్స్ ఒత్తిళ్లకు అనుగుణంగానే ధరలను 2 శాతానికి పరిమితం చేస్తున్నట్టు పేర్కొంది. ఈ ఏడాది కరెన్సీ మారకంలో ఎదురుగాలులు ఊహించిన దానికంటే ఎక్కువ కాలం కొనసాగాయి. యూరో స్థిరంగా రూ. 100 మార్కుకు పైనే ఉంది. దీనివల్ల స్థానిక ఉత్పత్తి కోసం దిగుమతి చేసుకున్న విడిభాగాలు మొదలుకొని, పూర్తిగా నిర్మించిన యూనిట్ల వరకు అన్ని కార్యకలాపాలపైనా ప్రభావితం కనిపిస్తోందని మెర్సిడెస్-బెంజ్ ఇండియా ఎండీ,సీఈఓ సంతోష్ అయ్యర్ అన్నారు. పెరిగిన ఖర్చులను స్థానిక విడిభాగాలను కొనుగోలు చేయడం ద్వారా తగ్గించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, కార్యకలాపాల నిర్వహణ కోసం కొంత పెంపు తప్పనిసరి. అంతేకాకుండా ద్రవ్యోల్బణ ఒత్తిడి, ఇన్‌పుట్ ఖర్చులు, కమొడిటీ ధరలు, పెరిగిన లాజిస్టిక్ ఖర్చులు కంపెనీ లాభాలపై ఒత్తిడి కలిగిస్తాయని, అందుకే ధరలను సర్దుబాటు చేస్తున్నట్టు కంపెనీ వివరణ ఇచ్చింది.

# రంగినేని చెంచయ్య అంకితభావం అభినందనీయం

## ప్రమాణ స్వీకారంలో కొనియాడిన ప్రముఖులు






**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, డిసెంబర్ 13:** శ్రీకాళహస్తి రంగినేని చెంచయ్యనాయుడు అంకితభావం అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం యార్డు ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళిమోహన్, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు నరసింహయాదవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గం అంటే గుర్తొచ్చేది బొజ్జల కుటుంబం అన్నారు. బొజ్జల కుటుంబాన్ని నమ్మకున్న వారికి ఎవరికీ అన్యాయం జరగదన్నారు. ఇందుకు నిలువెత్తు సాక్ష్యం రంగినేని చెంచయ్య



నాయుడు అన్నారు. రంగినేని చెంచయ్య నాయుడు కుటుంబం మొదటి నుంచి బొజ్జల కుటుంబాన్నే నమ్ముకుని ఉందన్నారు. అందుకే చెంచయ్యనాయుడుకు మూడు పర్యాయాలు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. రంగినేని చెంచయ్య సౌమ్యుడు, నిజాయతీ పరుడు అని కొనియాడారు. అందుకే చెంచయ్యకు బొజ్జల కుటుంబం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్ని సమస్యలు ఎదురైనా రంగినేని చెంచయ్య నాయుడు టీడీపీని వీడలేదన్నారు. వైసీపీ హయాంలో చెంచయ్యపై అనేక అక్రమ కేసులు పెట్టి హింసించారన్నారు. అయినా ఆయన మొక్కవోని ధైర్యంతో ముందుకు వెళ్లారని కొనియాడారు. రంగినేని చెంచయ్యకు రైతుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని.వారి సంక్షేమం కోసం పని చేస్తారని వక్తలు అభిప్రాయ పడ్డారు. మార్కెట్ యార్డు అభివృద్ధి పథంలో నడిపిస్తారన్నారు. ఇక ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వంగా నిలుస్తూ... రైతుల అభివృద్ధిలో అండదండగా నిలుస్తుందన్నారు. కాగా మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా చెంచయ్య నాయుడు, ఉపాధ్యక్షు డిగా గంగిరెడ్డి, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారానికి ముందు పట్టణంలోభారీ ఎత్తున ఊరేగింపు జరిగింది.

# పేదల పక్షపాతి వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్,13:** శ్రీకాళహస్తి వడ్లతాంగల్ చెంగల్రాయ రెడ్డి పేదల పక్షపాతి అని ఆయన తనయుడు, ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి చెప్పారు. వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి ఆరోవ వర్ధంతి వేడుకలు శనివారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. చెంగల్రాయరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి వడ్లతాంగల్ చెంగల్రాయరెడ్డి ఎపుడూ పేదల గురించి ఆలోచించే వారన్నారు. పేదలకు సాయం చేస్తూ దయాగుణం చాటుకునే వారన్నారు. కష్టాల్లో ఉన్న వారు ఎవరు వచ్చినా వారికి సాయం చేయడం ఆయన గుణం అన్నారు. అందుకే తన తండ్రి చెంగల్రాయరెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. తన ఇంటికి వచ్చిన పేదలకు ఆకలి తీర్చకుండా ఆయన పంపే వారు కాదన్నారు. అందుకే ఆయన వర్ధంతి రోజున వందలాది మంది పేదలకు అన్నదానం చేస్తున్నామన్నారు. వర్ధంతి వేడుకలకు హాజరైన వారికి వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి ప్రత్యే



కంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు, హేమ భూషణ రెడ్డి, పఠాన్ ఫరీద్, మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం.. రియాన్ పరాగ్ టీమ్ మేట్స్‌పై వేటు


సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ-2025లో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో అస్సాంకు చెందిన నలుగురు ఆటగాళ్లు మ్యాచ్ ఫిక్సింగ్ చేసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఆ నలుగురు ప్లేయర్లను అమిత్ సిన్హా ఇషాన్ అహ్మద్, అమన్ త్రిపాఠి, అభిషేక్ ఠాకుర్‌లగా అస్సాం క్రికెట్ అసోసియేషన్ గుర్తించింది. దీంతో వారిపై ఏసీఏ సస్పెన్షన్ వేటు వేసింది. నవంబర్ 26 నుంచి డిసెంబర్ 8 వరకు లక్నోలో జరిగిన లీగ్ మ్యాచ్‌లలో ఈ నలుగురు.. సహచర ఆటగాళ్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారంట. ఈ విషయాన్ని అస్సాం క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సనాతన్ దాస్ ధ్రువీకరించారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా ఈ నలుగురిపై గువహతిలోని క్రైమ్ బ్రాంచ్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమైంది. ఈ విషయంపై బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం ఇప్పటికే ప్రాథమిక విచారణ చేపట్టినట్లు సమాచారం. సస్పెండ్ అయిన వారిలో అభిషేక్ ఠాకూర్.. ఈ ఏడాది రంజీ సీజన్‌లో అస్సాం



తరపున రెండు మ్యాచ్‌లు ఆడారు. మిగితా ప్లేయర్లు దేశీయ క్రికెట్‌లో వివిధ స్థాయిల్లో అస్సాంకు ప్రాతినిధ్యం వహించారు. టీమిండియా క్రికెటర్ రియాన్ పరాగ్ సైతం అస్సాంకు ప్రాతినిథ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే.

### ఫుట్‌బాల్ దిగ్గజాన్ని కలిసేందుకు స్వదేశానికి కోహ్లీ

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సి భారత పర్యటనలో బిజీబిజీగా గడుపుతున్నాడు. 'గోట్ ఇండియా టూర్'లో భాగంగా తన బ ృందంతో కలిసి విచ్చేసిని సాకర్ మాంత్రికుడిని కలిసేందుకు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు పోటీపడుతున్నారు. క్రికెట్ గోట్ విరాట్ కోహ్లీసైతం మెస్సిని ప్రత్యక్షంగా చూసి, ఫొటో దిగేందుకు సిద్ధమవుతున్నాడు. తన అభిమాన ఆటగాడిని చూసేందుకు విరాట్ కోహ్లీ శనివారం స్వదేశం వచ్చేశాడు. ముంబై విమానాశ్రంలో విరాట్ భార్య అనుష్క శర్మతో కలిసి మీడియా కంటపడిన ద ృశ్యాలు నెట్టింట వైరలవుతున్నాయి. వన్డేల్లో మాత్రమే ఆడుతున్న కోహ్లీ దక్షిణాఫ్రికాతో సిరీస్ తర్వాత లండన్ వెళ్లిపోయాడు. గోట్ ఇండియా టూర్‌లో భాగంగా లియోనల్ మెస్సి భారత్‌కు రావడంతో కోహ్లీ సైతం అతడిని కలుస్తాడనే వార్తలు వినిపించాయి. డిసెంబర్ 14న ముంబైలో మెస్సి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో విరాట్ రాకను ఊహించారంతా. అనుకున్నట్టే శనివారం కింగ్ కోహ్లీ, భార్య అనుష్కతో కలిసి ముంబైలో ప్రత్యక్షమయ్యాడు. మూడు రోజుల పర్యటనలో కోల్‌కతాలో సందడి చేసిన మెస్సితో బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్, మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ ఫొటోలు దిగి మురిసిపోయారు. కోల్‌కతా తర్వాత హైదరాబాద్‌లో



వాలిపోయిన ఫుట్‌బాల్ స్టార్ ఉప్పల్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడి.. రాత్రి ముంబై విమానం ఎక్కనున్నాడు. ఇటీవలే సఫారీలపై వన్డే సిరీస్‌లో రెండు శతకాలతో రెచ్చిపోయిన విరాట్.. అత్యధిక పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు. వచ్చే వన్డే ప్రపంచకప్ ఆడాలనుకుంటున్న ఈ మాజీ కెప్టెన్ 50 ఓవర్ల ఫార్మాట్లో జరిగే విజయ్ హజారే ట్రోఫీలో ఆడేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే.

## స్పోర్ట్స్

### ప్రపంచకప్ టికెట్ పోస్టర్‌పై పీసీబీ అసంతృప్తి.. పాక్ కెప్టెన్ ఫొటోకోసం డిమాండ్..!




వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ టికెట్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. డిసెంబర్ 11 సాయంత్రం 6:45 నుంచి 'బుక్‌మైషో'లో టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. అయితే.. ఐసీసీ విడుదల చేసిన టికెట్ పోస్టర్‌పై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అసంత ృప్తి వ్యక్తం చేస్తోంది. మెగా టోర్నీ టికెట్ల పోస్టర్ మీద తమ జట్టు కెప్టెన్ సల్మాన్ అఘా ఫొటో లేకపోవడంపై పీసీబీ మండిపడుతోంది. పురుషుల పొట్టి ప్రపంచకప్ టికెట్లను డిసెంబర్ 11న విడుదల చేసింది ఐసీసీ. టికెట్ పోస్టర్‌పై ప్రధాన జట్ల కెప్టెన్ల ఫొటోలను మాత్రమే ముద్రించారు. భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, మిచెల్ మార్ష్ (ఆస్ట్రేలియా), హ్యారీ బ్రూక్(ఇంగ్లండ్), దసున్ శనక(శ్రీలంక), ఎడెన్ మర్క్‌రమ్(దక్షిణాఫ్రికా) ఫొటోలు మాత్రమే ఉన్నాయి. దాంతో.. తమది కూడా పెద్ద జట్టేనని, తమ కెప్టెన్ సల్మాన్ అఘా ఫొటో లేకపోవడం అవమానకరమని పాక్ క్రికెట్ బోర్డు అంటోంది. ఇటీవల ఆసియా కప్ ప్రచారంలోనూ తమ కెప్టెన్ ఫొటోను ఉపయోగించలేదని, ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌లోనూ తమ జట్టును ఐసీసీ విస్మరించిందని పీసీబీ వాపోతోంది. 'ఈమధ్యే ముగిసిన ఆసియా కప్‌లోనూ మాకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అప్పుడు అధికారిక ప్రసార సాధనాల్లో పాక్ కెప్టెన్ ఫొటో లేదు. ఆసియా క్రికెట్ కౌన్సిల్‌ను ఇదేంటి? అని ప్రశ్నించగా.. టోర్నీ ప్రచార వీడియోలో మా సారథి సల్మాన్ అఘా ఫొటోను పెట్టారు. ఇప్పుడు టీ20 ప్రపంచకప్ టికెట్ పోస్టర్ మీద కూడా మా జట్టు కెప్టెన్ ఫొటో లేదు. ఈ విషయాన్ని ఐసీసీతోనే తేల్చుకుంటాం. మా కెప్టెన్ ఫొటో పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అని పీసీబీ వర్గాలు తెలిపాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న భారత్, శ్రీలంక వేదికగా ప్రపంచకప్ షురూ కానుంది. పాక్ జట్టు మ్యాచ్‌లన్నీ కొలంబోలో జరుగనున్న విషయం తెలిసిందే.

Edited Printed Published & Owned by Dama VijayAKumar. And Printed at Vijay Publishers and Printers, #1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. Published at Vijay Publications, 1-176, Anjur Village and Post, K.V.B.Puram Mandal, Tirupati District, Andhra pradesh. EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/2023/86143